కథానిక

# "విజయ విలాసము"

"రాజా"

"మీరు ఎప్పుడూ ఆలోచిస్తూ వుంటారు. ఎప్పుడూ గాలిమేడలే. ఇది నిజమే నంటారా?" అన్నాడు జోతిష్కుడు రాధ చెయ్యి చూస్తూ.

"అవును నిజమే. తర్వాత?..." కుతూహలంతో అడిగింది రాధ.

ఆ రోజు ఆదివారం. కాలేజీలేదు. ఏమీ తోచక ఈజీచైర్‌లో కూర్చుని వాకిట్లోకి చూస్తున్న రాధ కాలక్షేపానికి దారేపోయే జోతిష్కుడ్ని పిలిచింది.

"మీరు బాగా పెద్దచదువులు చదువుతారు. చదవాలని వుందిగదూ" అర్థంలేని ప్రశ్న వేశాడు జ్యోతిష్కుడు.

"ఊఁ..." అంది పరధ్యానంగా రాధ.

"ఒక్కవిషయం చెప్తా. కోపం రాకూడదు" మొఖంలోకి చూస్తూ అన్నాడు.

"నువ్వు ఇప్పుడు చెప్పినది ఎవరైనా చెప్పగలరు. విసిగించక ఆదేదో చెబుదూ."

"మీరుమనసులోని భావాలను దాచేస్తున్నారు. మీరు ఒకర్ని ప్రేమిస్తున్నారు. అయినా పైకి రానీయకుండా భావాలను దాస్తున్నారు. అతను కూడా అంతే. మీరు మీ వుద్దేశాలను ఎక్స్‌ప్రెస్ చెయ్యకపోతే తర్వాత పశ్చాత్తాప పడవలసి వస్తుంది" అన్నాడు.

"ఊఁ. సంతోషించాంలే. ఇక నడు" కాలక్షేపానికి పిలిచిన వాడిని వెంటనే పంపబోయింది. "చెప్పనీనమ్మా. చివరి కేమవుతుంది?" అంది కొంటెగా వదిన.

"ఆ అమ్మాయికి అసలే కోపంగా వుంది. నే పోతాలే అమ్మా ఇదిగో అమ్మాయ్ నే చెప్పే మాట మాత్రం నిజం" అంటూ వెళ్ళిపోయాడు జోతిష్కుడు.

రాధ ఆలోచించడం మొదలు పెట్టింది. "తనా, ఎవర్నో ప్రేమించడమా. తనకే నవ్వొస్తోంది. బహుశా తనకి కూడా తెలియకుండా...ఛా. తనకు తెలియకుండా తనెలా ప్రేమించడం? ఏమో. ఏం చెప్పగలం ఈ ఇరవైయో శతాబ్దంలో ఏంజరిగినా జరుగుతాయి.

తను ప్రేమిస్తోందే అనుకుందాం. ఎవర్ని? ఎవరో అబ్బాయైవుండాలి గదా. ఎవరా మహానుభావుడు? బహుశా తను చూస్తున్న వాళ్ళే అయ్యుండాలి. ఎవర్ని రోజూ తను చూస్తుంది?... పొద్దున్నే పాలవాడిని. ఛా, తన ఆలోచనలకి తనకే పొట్టచెక్కలయ్యేలా నవ్వొచ్చింది. ఇంతా చదువుకుని తను పాలవాడిని ప్రేమించడం. తనకసలు వాడంటేనే అసహ్యం. ఇకపోతే ఎదురింట్లో నలభైఏళ్ళ ఆయన తప్ప మరెవ్వరూ లేరు. ఆయనెలాగూ పనికిరాడు. ఇక పక్క ఇళ్ళల్లో చిన్నచిన్న పిల్లలు వున్న మగాళ్ళంతా. ఇక మిగిలింది బస్సుస్టాండు దగ్గర అబ్బో, రోజూ లక్ష మందిని చూస్తుంది. ఎవర్నని ఇప్పుడు జ్ఞాపకం తెచ్చుకోడం.

"భోజనం ఇప్పుడు చేస్తావా? ఆలోచనలయ్యాకా?" వదిన మాటలతో రాధకు మెలుకువ వచ్చింది ఆలోకం నుంచి...

మర్నాడు మామూలుగా బస్‌స్టాండు దగ్గరకు వెళ్ళింది రాధ. సడెన్‌గా నిన్నటి మాటలు జ్ఞాపకం వచ్చాయి. ఇంతలో బస్సొస్తే ఎక్కింది.

ఆ బస్ తరువాత స్టేజీ దగ్గరకు మలుపు తిరిగి వెళ్ళాలి. తనకు తెలియకుండానే బస్‌స్టాండు కేసి చూసింది రాధ అక్కడ ఎంతోమంది నుంచుని వున్నారు. అందులో రాధ కళ్లు ఎవరికోసమో వెతుకుతున్నాయ్. ఇంతలో బస్సు అక్కడకు వచ్చింది అందరూ ఎక్కుతున్నారు. చివరకు సన్నగా, పొడుగ్గా, 'గాగుల్స్' పెట్టుకున్నతను కూడా ఎక్కాడు రాధ అంతవరకూ ఎంతో బాధగా ఫీలవుతున్నదల్లా ఒక్కసారి సర్దుకుని "అమ్మయ్య" అంటూ కూర్చుంది. పక్కనున్న ఫ్రండు "ఏమిటి" అంది. రాధ దద్దిల్లబడి "ఏంలేదు. ఏంలేదు" అంటూ కంగారు పడిపోయింది.

బహుశా తను ఇతన్నే నేమో ప్రేమిస్తున్నది. అవునేమో. తను ఎంత వద్దనుకున్నా తన కళ్లు తనకు తెలియకుండా అప్రయత్నంగా అతనికోసం అక్కడ ఎదురు చూస్తాయి. అతనురానినాడు ఎందుకో ఎంతో దిగులుగా వుంటుంది. సాయంత్రం అతను తను వచ్చే బస్సులోనే వస్తాడు. సరిగ్గా టైమ్ ఎలా తెలుస్తుందో. తను బుధవారం త్వరగా వస్తే అదే టైమ్‌కి అక్కడుంటాడు.

కాబట్టి అతన్నే తను ప్రేమిస్తోందన్న మాట. మరి తనకీ తెలియలేదే ఇన్నాళ్ళనుంచీ. ఇప్పటికైనా ఈ కంక్లూషన్‌కి వచ్చినందుకు సంతోషించింది. ఈ ఆలోచనలతో పక్కనున్న ఫ్రెండు తట్టి "ఏమే ఇందులోనే వుంటావా? వస్తావా?" అనగానే గభిక్కున లేచింది రాధ.

ఆ రోజంతా ఆదోలా వుంది. అతని పేరేమిటో వాళ్ళ కులమిటో, ఎందుకైనా మంచిది తెలుసుకోడం. కానీ.. ఎట్లా తెలుస్తుంది. ఎప్పుడు సాయంత్ర మవుతుందా ఎప్పుడు అతన్ని చూస్తానా అని ఎదురు చూస్తోంది రాధ. జ్యోతిషం నిజమన్నమాట. అదే నిజమైతే అతను కూడా తనని-


సాయంత్రం బస్సులో అతను కూడా మామూలుగా ఎక్కాడు. పక్కన ఆరోజు తనతో ఇంకో ఫ్రెండు ఎక్కింది. ఆ అమ్మాయి అతన్ని చూసి "అతను మా చుట్టం. పేరు కృష్ణమూర్తి. బి. కాం. చదువుతున్నాడు." అంది.

అమ్మయ్య! తలవని తలంపుగా, పిక్చర్స్‌లోలాగా ఎంత ప్రోబ్లం సాల్వు అయింది. ఆ అమ్మాయికి మనసులోనే థాంక్సు చెప్పింది. కృష్ణమూర్తి, ఎంత బావుంది పేరు. ఎంత వద్దనుకున్నా అతని గురించి ఆలోచనలు పోవడంలేదు మనసులోంచి.

వారం రోజులు గడిచాయి. ఆరోజు రాధ ఇంటికి వచ్చేటప్పటికి వదిన ముసిముసి నవ్వులతో ఎదురొచ్చి "ఇవాళ బలేతమాషా జరిగింది చెప్పుకో చూద్దాం."

"నువ్వే చెప్పు నే వింటా" అంది ఆలి తెలివిగా రాధ.

"ఇవ్వాళే ఒక అమ్మాయిని చూడడానికి ఒక అబ్బాయి వస్తాడుట. జ్యోతిష్కుడు చెప్పిన వాడవునో కాదో చూసుకో..."



ఇప్పుడు పెళ్ళికోసం ఎవరేడ్చారేం?" అని విసవిసా గదిలోకెళ్ళింది రాధ. వదిన తెల్లబోయింది...

మర్నాడు షికారెళ్ళి వస్తున్నారు వదినా మరదలూ. దార్లో కృష్ణమూర్తి కనుపించాడు. వదిన గబగబా "రాధా రాధా- అదిగో చూడు- అతనే నిన్న మనింటికి వచ్చింది. నువ్వు ఎవరికీ తెలియకుండా పారిపోయావు దొరసానివి. చూడు బాగుండలేదూ" అంది.

"ఆ! నిజంగా!" అంది రాధ. తన తెలివి తక్కువకి ఇప్పుడేం చెయ్యాలి. ఇప్పుడు విచారించి మాత్రం లాభం? రాధకు ఆపుకున్నా ఆగనంత ఏడుపు ముంచుకొస్తోంది. వదిన కంటిన్యూ చేస్తూపోతోంది. "అయినా నిన్న అల్లా చెయ్యడం బాగుందా! అవతల పెద్దమనుషులా? వాళ్ళు వచ్చి తిరిగి వెళ్ళారు. అయినా...అదేవమ్మా అల్లా కళ్ళనీళ్లు వస్తున్నాయ్. ఛా నేనేమన్నానని. ఇంతకీ నువ్వు చేసిన పనిమాత్రం బాగుందేం."

"అదికాదొదినా, అతనేనని తెలుస్తే వెళ్లేదాన్ని కాదు. కనీసం పేరన్నా చెప్తే ఆగేదాన్ని. అదంతా ఒక కథ. ఇంటికెళ్లాక చెప్తా నడు" అంది రాధ.

* * *

ఆ రోజు ఆదివారం. కాలేజీకి సెలవు. అందులో సంక్రాంతి పండుగ. ఆదివారంనాడే రావాలా ఈ పండుగ అని అందరూ విసుక్కుంటున్నారు. ఎవరో బయట తలుపు తట్టారు. వదిన వెళ్ళి తలుపుతీసి "రండి శాస్త్రులుగారూ" అంది.

"ఎవరు వదినా?" అంటూ బయటికి వచ్చింది రాధ. ఆ రోజు వచ్చిన జ్యోతిష్కుడు. ఆయన్ని చూసి నిర్ఘాంతపోయింది రాధ.

"ఏవమ్మా, పెళ్ళయినట్టుందే. కులాసాగా వున్నారా?" అన్నాడాయన.

"మీ జోతిష్యం నిజమైందండోయ్. ఏవమ్మా మరదలు పిల్లా" నవ్వుతూ అంది వదిన.

రాధ తలవంచుకుని నవ్వుతూ ఇంతలోకే అక్కడికి వచ్చిన కృష్ణమూర్తివంక చూసింది.

"ఏంరా మూర్తీ నాపనైందిగా. ఫ్రెండువి గదా ఇదేరా మర్యాదా, ఇలా వాకిట్లో నుంచోబెడతావా?" అన్నాడు జోతిష్కుడు.

రాధా, వదినా తెల్లబోయి కృష్ణమూర్తి వంక చూశారు. "రారా బఫూన్. మొత్తానికి వాళ్ళని నమ్మించావు. ఫ్యాన్సీడ్రస్ కాంపిటీషన్‌లో ఫస్టు ప్రైజు అందుకే వచ్చింది నీకు" అంటూ లోపలికి తీసుకెళ్ళాడు మూర్తి. "రాధా అతను మా ఫ్రెండు శేఖర్. నిన్ను చూసి నేనే వాడిని అలా పంపాను. మావాడు బలేగా వేశాడు కదూ వేషం."

"బాగుంది లెండి వేషం. వేషాన్ని మించిన మోసం."

"కోపమా రాధమ్మా! నూరు కల్లలాడి ఇల్లు నిలపమన్నారు. నేను అబద్ధం ఆడకుండానే నిల్పాను. ఇంతే శ్రీమతీ" శేఖర్ ఇంకా ఆ స్టైల్ లోనే..."ఛా తమాషా కన్నానండీ. ఇవాళ మళ్ళీ అదే డ్రెస్‌లో వచ్చారు. పాపం ఎంత కష్టపడ్డారో. కాఫీ తెస్తానుండండి" అంటూ బయల్దేరింది రాధ.

"కష్టపడ్డ వాడికేనా. నీతో వేగగల్గిన నాకు కూడానా?" కేకేశాడు మూర్తి.

"మిమ్మల్ని ఎవరు వేగమని బ్రతిమాలారు. నా టి..." వెడుతూన్న రాధ వెనక్కి తిరిగి అంది.

"ఆఁ ఆఁ నే నిక్కడుండగానే ఆయన్ని కాక పోతే నన్ను బ్రతిమాల లేదా. నేను లేననుకున్నావేమో" అంటూ వచ్చింది వదిన.

"అవునులే అంటారు కానీ, మీ మగాళ్ళ పనులకే అర్థాలు వేరు" కాఫీ కప్పులు అందిస్తూ అంది రాధ ఉక్రోషంగా.

"ఛో వదినా నువ్వు మరీను. నాకేం అక్కర్లేదు.

---

ఏమరుపాటున వచ్చి వెనుకనుండి యువతి కళ్ళు మూశాడు స్నేహితుడు. "ఎవరో పోల్చుకో చూదాం. మూడు ఛాన్సుల్లో చెప్పుకోవాలి. లేకపోతే బలవంతాన ముద్దు పెట్టేసుకుంటాను." అన్నాడు.

యువతి సీరియస్‌గా ప్రయత్నించి "అల్లసాని పెద్దన, బమ్మెర పోతన, ఖడ్గ తిక్కన-" అని పోల్చుకుంది.